

పెదతీనార్ల తీరంలో తిమింగలం కళేబరం

నక్కపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతీనార్ల వద్ద సముద్ర తీరానికి సోమవారం మృత తిమింగలం కొట్టుకువచ్చింది. ఇది సుమారు 15 అడుగుల పొడవు, రెండు టన్నుల బరువు వుందని మత్స్యకారులు చెబుతున్నారు.



తిమింగలం కళేబరం

కలకలం రేపిన జడ్పీటీసీ హత్యోదంతం



వారా నూకరాజు (ఫైల్ ఫొటో)

- ఛటర్జీపురంలో 10.83 ఎకరాలను అనాదిగా సాగు చేసుకుంటున్న గిరిజనులు
- రెండు దశాబ్దాల క్రితం తెరపైకి హక్కుదారుల పేర్లు
- విశాఖకు చెందిన ముగ్గురికి విక్రయం
- ఐదేళ్ల తరువాత మరోసారి చేతులు మారిన భూమి

భూ వివాదమే కారణం

- మరో ఇద్దరితో కలిసి కొనుగోలు చేసిన కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు
- 2016లో తహసీల్దారుకు మొరపెట్టుకున్న గిరిజనులు
- క్షేత్రస్థాయిలో విచారించి.. సాగుదారులుగా పేర్లు నమోదు
- అప్పటి నుంచి గిరిజనులకు నూకరాజుకు మధ్య గొడవలు



వివాదాస్పద భూముల్లోని అరటి తోటలో నూకరాజు మృతదేహం

రోలుగుంట/కొయ్యూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): **రోలుగుంట మండలం ఎంకే పట్నం పంచాయతీ శివారు ఛటర్జీపురంలో వివాదాస్పద భూములకు సంబంధించి కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజుకు, స్థానిక గిరిజనులకు మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. వాస్తవంగా ఈ భూములను స్థానిక గిరిజనులు చాలా ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. సుమారు పదేళ్లపాటు రెవెన్యూ రికార్డుల్లో సాగుదారులుగా వీరి పేర్లే వున్నాయి. కానీ రెండేళ్ల క్రితం ఒక రెవెన్యూ అధికారి వీరి పేర్లను రికార్డుల నంచి తొలగించేశారు. అప్పటికే రెండుసార్లు ఈ భూములు చేతులు మారాయి. సుమారు నాలుగేళ్ల నుంచి వారా నూకరాజుకు, స్థానిక సాగుదారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ తీవ్రమై నూకరాజు హత్యకు దారితీశాయి. వివాదాస్పద భూములకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.**

రోలుగుంట మండలం ఎంకేపట్నం రెవెన్యూ పరిధిలోని ఛటర్జీపురం సర్వే నంబరు 139లో సుమారు 30 ఎకరాల భూమి వుంది. ఇది ఎంకేపట్నం గ్రామానికి చెందిన కొత్తరాజుకు చెందినదని స్థానికులు చెబుతున్నారు. ఇందులో 10.83 ఎకరాలను ఛటర్జీపురం గ్రామానికి చెందిన గిరిజనులు చాలా కాలంగా సాగుచేసుకుంటున్నారు. కొత్తరాజుకు సంతానం లేకపోవడంతో ఆయన మేనల్లుళ్లు అయిన చెంచులాడ కృష్ణంరాజు, చెంచులాడ సత్యనారాయణరాజు, చెంచులాడ శివరామరాజు, చెంచులాడ వెంకటరాజు, చెంచులాడ సత్య సింహాద్రి వీర వెంకట రాజులకు చెందేటట్టు వీలునామా రాసినట్టు చెబుతున్నారు. తరువాత 2005లో ఈ ఐదుగురు కలిసి సర్వే నంబరు 139లో గిరిజనుల సాగులో వున్న 10.83 ఎకరాలను విశాఖపట్నానికి చెందిన ఆడారి నాగ అప్పలరాజు, యల్లపు శ్రీనివాసరావు, దాడి వెంకటరమణలకు (డాక్యుమెంట్ నంబర్ 2980/2005) విక్రయించారు. కానీ కొనుగోలుదారులు భూమిని తమ ఆధీనంలోకి తీసుకోలేదు. స్థానిక గిరిజనులు యథావిధిగా సాగు చేసుకుంటున్నారు.

ఇదిలావుండగా 2015 డిసెంబరు 9వ తేదీన ఆడారి నాగ అప్పలరాజు, యల్లపు శ్రీనివాసరావు, దాడి వెంకటరమణలు ఈ భూమిని వారా నూకరాజు, ఇంజారపు సూర్య ప్రకాశ్, మాకిరెడ్డి వెంకట కనకమహాలక్ష్మిలకు (డాక్యుమెంట్ నంబరు 5346/2015) విక్రయించారు. ఈ సమయానికి కూడా గిరిజనులు సాగులో వున్నారు. అప్పటికే రెండోసారి చేతులు మారడంతో.. తమకు సాగు హక్కు కల్పించాలంటూ గిరిజనులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేస్తూ, తరచూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. 2016లో ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన పెంటకోట అప్పలనాయుడు, వీరి విజ్ఞప్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఛటర్జీపురం గిరిజనులే సాగులో వున్నట్టు నిర్ధారించి, వెబ్‌ల్యాండ్‌లో 13వ కాలమ్‌లో వీరి పేర్లు నమోదు చేశారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు. కానీ ఈ సమాచారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరలేదు. కాగా నాలుగేళ్ల క్రితం వారా నూకరాజు, ఫైల విజయరాణి (జీపీఏ హోల్డర్), మాకిరెడ్డి వెంకట కనకమహాలక్ష్మి భూమిని ... మిగతా 6వ పేజీలో

కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు హత్య

.... వివరాలు మెయిన్‌లో

పడకేసిన పనులు

లక్ష్యానికి దూరంగా పేదల ఇళ్ల నిర్మాణాలు

- రూ.50-75 వేలు అదనపు సాయం ప్రకటించిన ప్రభుత్వం
- గడువు దాటినా ముందుకుసాగని పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పేదల ఇళ్ల నిర్మాణాలు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న తీరున వుంది. ప్రభుత్వం అదనపు సాయం అందించినా.. ఇళ్ల పనులు మందకొడిగా జరుగుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు పెద్ద సంఖ్యలో పక్కా ఇళ్లు మంజూరు చేసినట్టు ఆర్భాటంగా ప్రచారం చేసుకుంది. కొత్తగా ఊళ్లకు ఊళ్లు నిర్మించనున్నట్టు పార్టీ నేతలు గొప్పలు చెప్పుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. మంజూరు చేసిన ఇళ్లల్లో సగం కూడా పూర్తి కాలేదు. గత ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం, నిర్మాణ వ్యయంతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న సాయం చాలా తక్కువ కావడం, నివాసానికి అనువైన ప్రదేశాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడం వంటివి ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పేదల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మాత్రమే ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు సాయంగా ప్రకటించింది. జిల్లాలో మొత్తం 5,797 మందికి అదనపు సాయం మంజూరు చేశారు. వీరిలో బీసీలు 4,524 మంది, ఎస్సీలు 1,021 మంది, ఎస్టీలు 252 మంది ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు చివరినాటికి పనులు పూర్తిచేయాలన్నది లక్ష్యం. గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి చేసిన పనుల ఆధారంగా నాలుగు విడతల్లో డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



ఎస్.రాయవరం మండం సర్వసిద్ధిలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం

కానీ ఒక మండలంలో కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదు. కనీసం సగం మంది కూడా పనులు పూర్తి చేయలేదు. మొత్తం (రూ.50 వేలు) ఒకేసారి అందజేస్తేనే పనులు పూర్తి చేయగలమని పలువురు లబ్ధిదారులు స్పష్టం చేస్తున్నారు. ఎస్.రాయవరం మండలంలో 148 మందికి అదనపు సాయం మంజూరు కాగా 30 మంది మాత్రమే పనులు ప్రారంభించారు.

ఇతర పథకాల ఇళ్లు సైతం..

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గత వైసీపీ హయాంలో పట్టణ ప్రాంతాల్లో కింద 57,122, గ్రామీణ ప్రాంతాల్లో కింద 8,678... మొత్తం 65,800 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 33,158 గృహనిర్మాణాలు ఈ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి సరిగా సరఫరా చేయకపోవడంతో పనులు పూర్తి చేయలేకపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎంపిక చేసిన 13,687 గృహ నిర్మాణ పనులను ఈ ఏడాది మే 31 నాటికి పూర్తి చేయాలని భావించారు. కానీ పనులు పూర్తి చేసేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో ముందుకు సాగడం లేదు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ విజయకృష్ణన్



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ విజయకృష్ణన్.. ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు వుంచి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టడం గర్వకారణమన్నారు. అమరులైన పోలీసులను స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, 1959 అక్టోబరు 21న చైనా సరిహద్దులో దేశ భద్రత కోసం పది మంది జవాన్లు ప్రాణత్యాగం చేశారని, అప్పటి నుంచి ఏటా ఈ రోజున పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నామన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా పది మంది పోలీసు అమరవీరుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయంగా నరకాసురుడి వధ

- అనకాపల్లిలో భారీ దిష్టిబొమ్మ దహనం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక గవరపాలెం పీలా వారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద భక్తుల కోలాహలం మధ్య నరకాసురుని వధ జరిగింది. నిర్వాహకులు సుమారు 15 అడుగుల ఎత్తున నరకాసురుడి దిష్టిబొమ్మను తయారు చేశారు. ఇందులో పలు రకాల బాణసంచా సామగ్రిని నింపారు. దిష్టిబొమ్మకు ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ నిప్పంటించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు గవరపాలెంతోపాటు పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి మహాలక్ష్మినాయుడు, కార్యదర్శి బుద్ద శివ, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దహనం అవుతున్న నరకాసురుడి దిష్టిబొమ్మ

వైసీపీకి మరో దెబ్బ

ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు పార్టీకి కాకర దేవి గుడ్‌బై

- వైసీపీ సభ్యత్వంతోపాటు మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా
- నేడు తెలుగుదేశం పార్టీలో చేరిక?



మీడియాతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలో వైసీపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి వైసీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పదవితోపాటు పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం గోకులపాడు సమీపంలో భర్త అప్పారావుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన రాజకీయ గురువు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు వైసీపీని వీడి టీడీపీలో చేరినప్పటికీ తాను మాత్రం వైసీపీలోనే కొనసాగుతున్నానని, కానీ ఈ పార్టీ నాయకులు తనకు కనీస విలువ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఇటీవల కాలంలో మూడు ప్రధాన సమావేశాలు నిర్వహించారని, కానీ ఒక్కదానికి కూడా తనను ఆహ్వానించలేదన్నారు. వైసీపీ నాయకుల తీరు నచ్చకపోవడంతోపాటు తనకు విలువ ఇవ్వకపోవడంతో రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. కాగా బుధవారం ఎస్.రాయవరంలో నిర్వహించే ఒక సమావేశంలో కాకర దేవి, ఆమె అప్పారావు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు తెలిసింది.

ఎస్.రాయవరంలో వైసీపీ ఖాళీ

ఎస్.రాయవరం మండలంలో వైసీపీ ఖాళీ అవుతున్నది. వైస్ ఎంపీపీ, సీనియర్ నేత బొలిశెట్టి గోవిందరావు ఇటీవల వైసీపీకి రాజీనామాచేసిన విషయం తెలిసిందే. తరువాత ఎంపీపీ వెంకటలక్ష్మి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వైసీపీకి రాజీనామా చేసి బొలిశెట్టితోపాటు టీడీపీలో చేరారు. ఇప్పుడు జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి కూడా వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ చాలా వరకు ఖాళీ అయ్యింది.

వైద్య సేవలు బంద్



గడిచిన 12 రోజులుగా ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె

- బకాయిలు చెల్లించాలని డిమాండ్
- అత్యవసర సేవలు మినహా మిగిలినవన్నీ నిలిపివేత
- రోగుల అవస్థలు
- డబ్బులు చెల్లించి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిన పరిస్థితి

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): **శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక యువకుడు (28) మూత్రంలో రక్తం పడుతుండడంతో అక్కడ ఆస్పత్రిలో చూపించుకున్నాడు. అక్కడి వైద్యుల సూచన మేరకు హెల్త్ సిటీలోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' కింద సేవలు నిలిపేసినందున రూ.70 వేలు చెల్లించాలని స్పష్టంచేశారు. అంత చెల్లించే స్థోమత లేకపోవడంతో సదరు యువకుడు కేజీహెచ్‌లో చేరి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు.**

గాజువాక ప్రాంతానికి చెందిన మహిళ (39) కొద్దిరోజులు నుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. మూడు రోజులు కిందట మరోసారి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. గర్భసంచి దగ్గరలో గడ్డలు ఉన్నాయని తొలగించేందుకు శస్త్రచికిత్స నిర్వహించాలని చెప్పారు. అందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు ఖర్చవుతుందని చెప్పారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ కార్డు ఉందని చెప్పగా..సేవలు అందించడం లేదన్నారు. అంత డబ్బు చెల్లించే స్థోమత లేక ఆమె కేజీహెచ్‌లో చేరి శస్త్ర చికిత్స చేయించుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద చికిత్సలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ నెల 10 నుంచి ఆస్పత్రులు సమ్మె చేపట్టాయి. నాటి నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు (అత్యవసర సేవలు మినహా) పూర్తిగా నిలిచిపోయాయి. వివిధ అనారోగ్య సమస్యలతో వస్తున్న వారికి వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయి. దీంతో కొందరు రోగులు డబ్బులు చెల్లించి వైద్య సేవలు పొందుతుండగా, ఆర్థిక స్థోమత లేనివారు కేజీహెచ్, విమ్స్ వంటి వాటిల్లో చేరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు..

ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో జిల్లాలో 65 ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 32 ఆస్పత్రులు ఓపీ, ఐపీ సేవలను పూర్తిగా నిలిపివేశాయి. మరో 31 ఆస్పత్రుల్లో సాధారణ సేవలను అందిస్తున్నాయి. అయితే, సేవలను పూర్తిగా నిలిపివేసిన 32 ఆస్పత్రుల్లో ప్రధానమైన శస్త్ర చికిత్సలు నిర్వహించేవి ఉండడంతో రోగులు ఇబ్బందులు ... మిగతా 6వ పేజీలో

బెల్లం ధరకు రెక్కలు

వంద కిలోలు రూ. 6,090

- ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో సరికొత్త రికార్డు



యార్డులో బెల్లం దిమ్మలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో మంగళవారం బెల్లం ధరలు రికార్డుస్థాయిలో పెరిగాయి. మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకటో రకం వంద కిలోలు రూ.6,090 పలికింది. గతంలో ఎన్నడూ రూ.5,500 దాటిన దాఖలాలు లేవు. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్ యార్డుకు కొత్త బెల్లం రాక మొదలైంది. మంగళవారం 871 బెల్లం దిమ్మలు వచ్చాయి. వీటిలో ఒకటో రకం 498, రెండో రకం 244, నల్ల బెల్లం 129 దిమ్మలు వున్నాయి. ఒకటో రకం క్వింటా రూ.6.090 పలకగా రెండో రకం రూ.4,600లు, మూడో రకం రూ.4 వేలు పలికినట్టు మార్కెట్ యార్డు అధికారులు తెలిపారు. యార్డుకు వస్తున్న బెల్లంతో పోలిస్తే డిమాండ్ ఎక్కువ వుండడంతో ధరలు పెరుగుతున్నాయని వర్తకులు చెబుతున్నారు. నాగుల చవితి వరకు బెల్లం ధరలు ఇంచుమించు ఇదే విధంగా వుంటాయని విశ్లేషిస్తున్నారు.

పండగపూట విషాదం

- పాతగాజువాక జంక్షన్‌లో ఘోర ప్రమాదం



అజయ్ (ఫైల్)



మనోజ్ (ఫైల్)

- డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- ఇద్దరు యువకులు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు

- 7లో

సీఎం చంద్రబాబుకి దొరస్వామి దీపావళి శుభాకాంక్షలు



అచ్యుతాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి సోమవారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తాను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందని దొరస్వామి తెలిపారు.

సకాలంలో శానిటేషన్ పనులు చేపట్టాలి

నక్కపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రవాతావరణం ఏర్పడాలంటే శానిటేషన్ పనులు సకాలంలో చేపట్టాలని ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు సూచించారు. మండలంలోని వేంపాడులో సోమవారం డోర్ టూ డోర్ తడి,పొడి చెత్త సేకరణ ఎలా చేస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. సంపద కేంద్రంలో సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు.

'మంత్రి రవీంద్రకు ఘనస్వాగతం పలకాలి'

నక్కపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీన అడ్డరోడ్డు కేంద్రంగా ఏర్పాటు చేయనున్న ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న మంత్రి కొల్లి రవీంద్రకు నియోజకవర్గం మత్స్యకారులు ఘనస్వాగతం పలకాలని టీడీపీ మత్స్యకార నాయకులు కోరారు. మంగళవారం స్థానికంగా వున్న హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద పెదతీనార్ల మాజీ సర్పంచ్ గోసల చినతాతారావు, వెంకటనగరం సర్పంచ్ వంకా రమణ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బల్క్‌డ్రగ్ పార్కు ఎవరి హయాంలో మంజూరైందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, అమాయకులమైన మత్స్యకారులను రెచ్చగొట్టే చర్యలకు పలువురు పాల్పడుతున్నారని చెప్పారు. హెటిరో, డెక్కన్, దివిస్, అరవిందో , లారస్ వంటి కంపెనీలు ఎవరి హయాంలో వచ్చాయో ప్రజలందరికీ తెలుసునన్నారు. మత్స్యకారుల సమస్యలను మంత్రులు కొల్లు రవీంద్ర, అనిత దృష్టికి తీసుకెళ్లాలంటే బుధవారం అడ్డరోడ్డులో వారికి మత్స్యకారులంతా ఘనస్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో మైలపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చోడపల్లిలో మాలధారణ భక్తులకు నిత్యాన్నదానం

అచ్యుతాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చోడమాంబికా అమ్మవారి ఆలయం వద్ద మాలధారణ భక్తులకు నిత్యాన్నప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గండిబోయిన వెంకట్, కాకి నూకరాజు, వడిసెల సన్యాసినాయుడు, గెద్దాడ నూకరాజు, లీలామోహనరావు, పట్నాల భీమేశ్వరరావు, కాకి అవతారం పాల్గొన్నారు.

చలో రాజయ్యపేటను విజయవంతం చేయాలి

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరసన దీక్షకు మద్దతు తెలిపేందుకు బుధవారం వైసీపీ చేపడుతున్న చలో రాజయ్యపేట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వైసీపీ ముఖ్య నాయకులు వస్తున్నారన్నారు.

పెనుగొల్లు పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు పీహెచ్‌సీని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈహెచ్‌ఆర్ పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్ టెస్టులు, మందుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవి, డిప్యూటీ డెమో రమణారావు, సీసీ లక్ష్మీనారాయణ, హెల్త్ హెడ్యూకేటర్‌లు రమణమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మునగపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపర్తి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని కనిపించపోవడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఈనెల 18వ తేదీన ఫంక్షన్‌కు వెళతానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిందన్నారు. రాత్రి అయినా రాకపోవడంతో తెలిసిన వారందరిని వాకబు చేసినా ఫలితం కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.

అనుమతులు లేని బాణసంచా విక్రయదారునిపై కేసు

మునగపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మునగపాక సంతబయల ప్రాంతంలో రెండుచోట్ల విక్రయాలు జరుగుతుండగా.. అందులో ఒకరు ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్నారు. అదే సమయంలో విక్రయదారులు పోలీసు విధులకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్ది బాణసంచా సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం మంగళవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఘనంగా జరిగింది. పోలీసు అమరవీరుల చిత్రపటానికి సీఐ జి.అప్పన్న, ఎస్‌ఐ పురుషోత్తం తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ గోవిందరావు, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

రాజయ్యపేటకు 48 మంది వైసీపీ నేతలకు అనుమతి

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామాన్ని సందర్శించేందుకు వైసీపీకి చెందిన 48 మందికి మాత్రమే అనుమతి ఉందని పాయకరావుపేట సీఐ జి.అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాజయ్యపేట గ్రామాన్ని సందర్శించేందుకు జిల్లా పోలీసులను కోరిన 48 మందికి మాత్రమే పోలీసుల అనుమతి ఉందన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు గ్రహించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

వరహానదిలో జారి పడి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం, పెనుగొల్లు గ్రామాల మధ్య వరహానది బ్రిడ్జి పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి కూరపాటి ఏసు (41) అనే వ్యక్తి మృతి చెందినట్టు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఏఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. వమ్మవరం గ్రామానికి చెందిన కూరపాటి ఏసు మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటాడు. సోమవారం సాయంత్రం ఏసు వరహానది బ్రిడ్జిపై నుంచి నడిచి వెళుతూ ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. అది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ కానరాలేదు. మంగళవారం పెనుగొల్లు సమీపంలో వరహానదిలో మృతదేహం లభ్యమైంది.

'సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికీకరణకు పెద్దపీట'

మునగపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):వైసీపీ పాలనలో వెనకబాటుకు గురైన ఏపీలో సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికీకరణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటుపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాన్ని చేస్తూ నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నారన్నారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతున్నా వైసీపీ తప్పుడు ప్రకటనలు చేస్తోందని, వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం పార్టీ శ్రేణులుపై ఉందన్నారు. ఈ సమావేశంలో కాండ్రేగుల శంకర్, సబ్బి శ్రీను, విల్లూరి నూకనర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

అచ్యుతాపురం/మునగపాక/ఎలమంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సోమవారం చీకటి పడిన తర్వాత టపాసులు కాల్చారు. మహిళలు రకరకాల పిండి వంటలు చేసి ఇంట్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అచ్యుతాపురం మండలం ఎంజేపురం శివాలయంలో శివలింగం, స్వస్తిక్, త్రిశూలం ఆకారంలో దీపాలంకరణ చేశారు. ఎలమంచిలి తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారి ఆలయం, తెరువుపల్లిలోని శ్రీరాముని ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి.



దీపావళి వేడుకలో భాగంగా చెరకు గెడలతో రైతు కుటుంబీకులు

పాల్తేరులో పారిశుధ్య లోపంపై జడ్పీ సీఈవో ఆగ్రహం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరులో పారిశుధ్యం లోపించడంపై జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. మంగళవారం పాల్తేరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో శానిటేషన్‌లో పాల్తేరు గ్రామం జిల్లాలో కనిష్ఠ స్థాయిలో ఉందన్నారు. చెత్త రిక్షా ఇంటింటికి వస్తుందా? లేదా? అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడం, సంపద తయారీ కేంద్రాన్ని సక్రమంగా వినియోగించకపోవడంపై జడ్పీ సీఈవో నారాయణమూర్తి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులలో గ్రామంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, రోడ్లపైన, ఇంటింటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని ఎంపీడీవో విజయలక్ష్మికి, పంచాయతీ కార్యదర్శి శివరాంను ఆదేశించారు. వారం రోజులలో మరల తాను గ్రామాన్ని సందర్శిస్తానన్నారు. ఎటువంటి మార్పు లేకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, టీడీపీ నాయకుటు అనిశెట్టి సూరి, కార్యదర్శి వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



పాల్తేరులో అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

ఘనంగా చిట్టిబాబు పుట్టిన రోజు వేడుకలు

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ తదితరులు బర్త్‌డే కేక్‌ని పెదిరెడ్డి చిట్టిబాబుకి తినిపించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిట్టిబాబు పలువురు పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, మజ్జూరి నారాయణరావు, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, మలిపెద్ది వెంకటరమణ, గారా కృష్ణప్రసాద్, ఎం.రమాకుమారి, సూరా సుబ్రహ్మణ్యం, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, గొల్లపల్లి నాగు, గొర్ల లక్ష్మీనారాయణ, ఎం.దుర్గాప్రసాద్, బొడపాటి శ్రీను, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పెదిరెడ్డి చిట్టిబాబుని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పీవీ రమణకు ఘన నివాళి

- అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డుకు, మునగపాక హైస్కూల్‌కు రమణ పేరు
- ప్రతిపాదిస్తామన్న ఎమ్మెల్యేలు సుందరపు, కొణతాల

మునగపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో సోమవారం పీవీ రమణ 106వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు అనకాపల్లి, ఎలమంచిలి, మాడుగుల ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగాను, ఒక పర్యాయం ఎమ్మెల్సీగాను, ఆర్ఈసీఎస్ వ్యవస్థాపకునిగా రాజకీయరంగంలో ఆయన చేసిన నిస్వార్థ సేవలు గురించి వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ 1952లో మునగపాక హైస్కూల్ నిర్మాణానికి సొంత ఆస్తులను పీవీ రమణ ఇచ్చారని, ఆయన పేరు పాఠశాలకు నామకరణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డుకు పీవీ రమణ పేరుతో పాటు జంక్షన్ వద్ద ఆయన విగ్రహం కూడా ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పీవీ రమణ రాజకీయ నిఘంటవని, నిరంతరం కార్మికుల పక్షాన నిలబడ్డాడని అన్నారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీలు వేరైనా రమణ సిద్ధాంతాలు, నిస్వార్థ సేవలు గురించి పార్టీ సమావేశాల్లో చెప్పుకుంటూనే ఉంటామన్నారు. తొలుత రమణ విగ్రహానికి నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్టు ఆడారి దేవకి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణ కుటుంబ సభ్యులు, అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పీవీ రమణ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, నేతలు

నేడు ఎన్‌టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

ఎస్.రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కూడలిలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణను బుధవారం ఏర్పాటు చేశారు. మంగళవారం నక్కపల్లి టీడీపీ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ విలేకర్లతో మాట్లాడుతూ ఎన్‌టీఆర్ విగ్రహ ఆవిష్కరణకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికసంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాని వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, తదితరులు పాల్గొన్నారు.



అట్టహాసంగా పంచరాత్రుల మహోత్సవాలు ప్రారంభం



సుబ్రహ్మణ్యేశ్వర సామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్



మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుకు జ్ఞాపిక అందజేస్తున్న రమాకుమారి




ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న తులసీనగర్‌లో భారీ సెట్టింగ్

ఎలమంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పంచరాత్రుల మహోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మ, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద దీపావళి నుంచి నాగులచవితి వరకు పంచరాత్రుల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం ఉదయం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్ దంపతులు తొలిపూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, ఆడారి ఆదిమూర్తి, ఆడారి రమణబాబు, కరణం రవి వేర్వేరుగా భూలోకమాంబ అమ్మవారు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామిలను దర్శించుకున్నారు. చైర్‌పర్సన్ రమాకుమారి కలిసి దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాలకు పట్టణ పురవీధులన్నీ భారీ విద్యుత్ అలంకరణలు, సెట్టింగ్‌లతో ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి.

ఉచిత వైద్య శిబిరంలో 600 మందికి పరీక్షలు

రాంబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం జిల్లాలోని ప్రముఖ ఆసుపత్రులకు చెందిన వైద్యులు 600 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. 50 మంది రక్తదానం చేశారు. శేఖర్ నేత్ర చికిత్సాలయం ఆధ్వర్యంలో రోగులకు కంటిపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర వైద్యశిబిరాన్ని సందర్శించారు. స్థానిక ఎస్‌ఐ నాగేంద్ర, సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు లయన్ తెడ్లపు వరహా సత్యనారాయణ, వైద్యులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నీతు చౌదరి, డాక్టర్‌పణికుమార్, డాక్టర్ సుజిత్, డాక్టర్ హేమమాలిని, డాక్టర్ సైయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మిఠాయి కొట్టు వ్యాపారి మృతి



మృతి చెందిన భాస్కరరావు (ఫైల్)

కోటవురట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులో ఆటో ఢీకొన్న ప్రమాదంలో మిఠాయి వ్యాపారి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమేశ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్లకు చెందిన టిల్లాపూడి భాస్కరరావు(57) ఇక్కడ జంక్షన్‌లో మిఠాయి దుకాణం నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసిన తరువాత సైకిల్‌పై సాయినగర్‌లో ఇంటికి బయలుదేరారు. ఎదురుగా నర్సీపట్నం వైపు నుంచి వస్తున్న ఆటో అతివేగంగా వచ్చి భాస్కరరావును ఢీకొన్నది. దీంతో అతనికి శరీరంపై పలుచోట్ల తీవ్రగాయాలు అయ్యాయి. ఆటో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లడానికి ప్రయత్నించాడు. స్థానిక యువకులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. క్షతగాత్రుడిని తొలుత స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో ప్రథమ చికిత్స తరువాత నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. ఇతని కుమారుడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు పంపిణీ

పాయకరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పత్రాలను మంగళవారం వెంకటనగరం పంచాయతీ రాజానగరం గ్రామానికి చెందిన నాయుడు బాబ్జి, కోడా లోకేష్‌లకు టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంకా శివ, వంకా హరి, గొల్లపల్లి నాగు, రాజాన ఆది, బాదిన గోపి, నాయుడు కోటయ్య పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూ కట్టిన రైతులు



తెరువుపల్లి రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

ఎలమంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ తెరువుపల్లిలోని రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. వరి పొలాలు పొట్టదశలో ఉండడంతో రైతులంతా యూరియా కోసం తరలివచ్చారు. రైతుకు ఒక్క యూరియా బస్తా చొప్పున పంపిణీ చేశామని వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీ ఫుట్‌బాల్ పోటీల్లో విజేత వైకింగ్స్ జట్టు

కోటవురట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో రాట్నాలపాలెం ఆర్ఎఫ్‌సీ కమిటీ ఆధ్వర్యంలోనాలుగు రోజుల పాటు నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల విజేతగా వైకింగ్స్ జట్టు నిలిచింది. సోమవారం సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు నువ్వా... నేనా అన్నట్టుగా జట్లు తలపడ్డాయి. అమిగోస్, వైకింగ్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. రెండు జట్లు చివరి వరకు ఒక గోల్ చేయకపోవడంతో పెనాల్టీ షూట్ అవుట్‌లో వైకింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఆర్ఎఫ్‌సీ క్లబ్ ప్రతినిధులు నగదు బహుమతులు అందజేశారు.

కోర్టుపేట స్కూలుకు కుర్చీలు వితరణ

ఎలమంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాను చదివిన పట్టణంలోని కోర్టుపేట ఎంపీపీ స్కూలుకు ఆరు కుర్చీలను విశ్రాంత ఉపాధ్యాయులు పుల్లా వెంకటరావు వితరణగా అందజేశారు. ఇదే స్కూలులో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదుకున్నానన్నారు. స్కూలు హెచ్ఎం సుంకర గీతామాధురి సమక్షంలో వీటిని అందజేశారు.

కొత్తూరులో అదనపు రేషన్ పాయింట్ ఏర్పాటు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం పంచాయతీ శివారు కొత్తూరులో అదనపు రేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తహశీల్దారు ఎస్‌ఏ మహేశ్వరరావు తెలిపారు. కొత్తూరులో 120 మంది కార్డుదారులు ప్రతి నెలా రెండు కిలోమీటర్ల దూరం నుంచి శ్రీరాంపురం వచ్చి రేషన్ తీసుకుంటున్నారు. ప్రతి నెలా గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారని, కొత్తూరులో అదనపు రేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ గారా కృష్ణ ప్రసాద్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై నర్సీపట్నం ఆర్డీవో ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ డీటీ విచారణ చేపట్టి నివేదికను అందించారు. కొత్తూరు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అదనపు రేషన్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తహశీల్దార్ తెలిపారు. నెలలో కొన్ని రోజులు కొత్తూరులో రేషన్ అందిస్తారు.

కలకలం రేపిన జడ్పీటీసీ హత్యోదంతం

... 5వ పేజీ తరువాయి

సర్వే నంబర్లు 139, 139/1, 139/2గా సబ్‌డివిజన్ చేయించుకున్నారు. తరువాత 04.10.2021న తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన మల్లాది రామరెడ్డికి విక్రయించారు. అనంతరం ఆయన ఈ భూముల్లో వున్న గిరిజనులను తొలగించి, తనకు అప్పగించాలని వారా నూకరాజుపై ఒత్తిడి తెచ్చారు. ఈ సందర్భంగా నూకరాజుకు, సాగుదారులకు మధ్య గొడవ జరిగింది. 2022లో అప్పటి తహశీల్దార్ వెంకటేశ్వరరావు వెబ్‌ల్యాండ్‌లో సాగుదారుల కాలమ్‌లో ఉన్న గిరిజనుల పేర్లను తొలగించి, మల్లాది రామిరెడ్డి పేరు చేర్చారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో సొమ్ము చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి. మళ్లీ వారా నూకరాజు డాక్యుమెంట్ నంబరు 508/2023 ద్వారా 19.01.2023న 4.9 ఎకరాలు, డాక్యుమెంట్ నంబరు 509/2023 ద్వారా 4.93 ఎకరాలు.. మొత్తం 9.83 ఎకరాలను మల్లాది రామిరెడ్డి ఉంచి కొనుగోలు చేశాడు. ఒకసారి అమ్మిన భూమిని రెండేళ్లకే తిరిగి వారా నూకరాజు కొనుగోలు చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. తాను కొనుగోలు చేసిన భూమిని ఆధీనంలోకి తెచ్చుకోవడానికి నూకరాజు ప్రయత్నించగా.. సాగుదారులు ఎదురుతిరిగారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తరువాత నూకరాజుకు, సాగుదారులైన గిరిజనులకు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భూములను గిరిజనులే సాగు చేసుకుంటున్నారు. నూకరాజు ఈ ఏడాది మార్చిలో నాలుగు ఆటోల్లో 20 మందిని ఛటర్జీపురం తీసుకెళ్లి గిరిజనులు సాగుచేసుకుంటున్న అరటి, జామ, ఇతర పంటలను నరికివేయించాడు. ఈ సందర్భంగా గిరిజనులు దాడి చేయడంతో నూకరాజుకు, ఆయన కుమారుడు కన్నబాబుకు గాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు నర్సీపట్నం కోర్టులో నడుస్తున్నది. తరువాత నూకరాజు రెండు, మూడుసార్లు గిరిజనులను బెదిరించడంతో వారు ఈ విషయాన్ని తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఎవ్వరూ ఆ భూముల్లోకి వెళ్లవద్దని, పంటలను సైతం అలాగే వుంచేయాలని తహశీల్దారు ఆదేశించారు. ఇరువర్గాలను బైండోవర్ చేశారు. మరోవైపు నూకరాజు తన భూములను తనకు అప్పగించాలంటూ కలెక్టర్, తహశీల్దార్‌కు పలుమార్లు అర్జీలు అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నూకరాజు, మరో పది మందితో కలిసి వివాదాస్పద భూముల వద్దకు వెళ్లి, సాగుదారులైన గిరిజనులతో గొడవకు దిగారు. దీంతో వారు ఎదురుదాడి చేసి, తీవ్రంగా గాయపరడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నూకరాజు పదేళ్ల నుంచి ఏ భూమి కోసం గిరిజనులతో గొడవలు పడుతున్నాడో.. చివరకు అదే భూమిలో ప్రాణాలు వదలడం యాధృచ్ఛికం!

కాగా ఈ భూ వివాదానికి సంబంధించి డిప్యూటీ తహశీల్దార్ శివను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇటీవల క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని, భూమికి సంబంధించి గిరిజనుల వద్ద ఎటువంటి రికార్డులు లేవని, వారు సాగులో మాత్రమే ఉన్నారని చెప్పారు. 2023లో అప్పటి తహశీల్దార్ వెంకటేశ్వరరావు వెబ్‌ల్యాండ్‌లో నుంచి గిరిజనుల పేర్లు తొలగించారన్నారు. సర్వే నంబరు 139కి సంబంధించి రికార్డుల్లో వారా నూకరాజు పేరు వుందని, 7.39 ఎకరాల భూమిని ఆయనకు అప్పగించడానికి రికార్డులు తయారుచేశామని చెప్పారు. మిగతా 2.44 ఎకరాలకు సంబంధించి కోర్టు వివాదంలో ఉన్నందున కోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

వైద్య సేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

పడుతున్నారు. జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు పక్కనున్న ఉమ్మడి తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందినవారు వస్తుంటారు. సాధారణ రోజుల్లో ఆస్పత్రుల్లో రోగులను చేర్చుకునేందుకు ముందస్తు అనుమతి కోసం అభ్యర్థనలు (ప్రీ ఆథరైజేషన్) 600 నుంచి 700 వరకూ వస్తుంటాయి. ఆస్పత్రులు సమ్మెలోకి దిగినప్పటి నుంచి 100 నుంచి 150 మాత్రమే ఉంటున్నాయి. అంటే, నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఏ స్థాయిలో సేవలు నిలిచిపోయాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం వస్తున్న ప్రీ ఆథరైజేషన్స్‌లో కూడా కేజీహెచ్, విమ్స్ వంటి ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు అత్యవసర వైద్య సేవలకు సంబంధించినవే ఉంటున్నాయి.

కొన్ని ఆస్పత్రుల్లో అత్యవసర సేవలకు ఓకే..

నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు కొన్ని హార్ట్ అటాక్, పాలీ ట్రామా, రోడ్ యాక్సిడెంట్స్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు చూస్తున్నాయి. మరికొన్ని ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఇకపోతే, ఇప్పటికే వైద్య సేవలు పొందుతున్న డయాలసిస్, క్యాన్సర్ రోగులకు మాత్రం యథావిధిగా సేవలు అందించాల్సి ఉంది. వీటికి ఇబ్బందిపెడితే అధికారులకు రోగులు ఫిర్యాదులు చేయవచ్చు.

స్పష్టత కరువు

తొలిసారి నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు పది రోజులకుపైగా సమ్మెలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం జిల్లాలోని ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్లు రావాల్సి ఉందంటున్నారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు సమ్మె విరమించబోమని ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- డాక్టర్ కె.అప్పారావు, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్

నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అప్పటివరకు రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ప్రత్యామ్నాయంగా కేజీహెచ్, విమ్స్‌తోపాటు బోధనాస్పత్రులుగా ఉన్న గీతం, గాయత్రి, ఎన్ఆర్ఐతోపాటు మరికొన్ని ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ తరహా ఇబ్బందులతో వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

కార్తీక మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

తుమ్మపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన రమా సమేత సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి దేవస్థానం కార్తీకమాస మహోత్సవ కరపత్రాలను మంగళవారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆవిష్కరించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్తీక మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, స్థానిక నాయకుడు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు





దివ్వెలు కాల్చుతున్న మాజీ మంత్రి దాడి కుటుంబీకులు.. చిచుబుడ్ల వెలుగులు

అనకాపల్లి టౌన్/అనకాపల్లి రూరల్/సబ్బవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీపావళి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సంతబయలులోని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసంలో ఆయనతో పాటు రత్నాకర్, కుటుంబ సభ్యులు చెరకు దివ్వెలు కొట్టి దీపావళి పండుగను జరుపుకున్నారు. రాత్రి ఏడు గంటల నుంచి ప్రారంభమైన బాణసంచా కాల్పులు పది గంటలు దాటే వరకు కొనసాగాయి. ప్రతి ఇంటా మట్టి ప్రమిదలు లేదా కొవ్వొత్తులు వెలిగించారు. అలాగే ప్రతి ఇంటిలోని పిల్లాపాపలతో కుటుంబ సభ్యులు బాణసంచా సామగ్రి చింకుబుడ్లు, కాకరపువ్వొత్తులు తదితర సామగ్రిని వెలిగించి పండుగ ఆనందంగా జరుపుకున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో టపాసుల శబ్దాలతో పాటు వెలుగులతో దగదగలాడాయి. అలాగే దేవాలయాలకు కుటుంబ సమేతంగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తమ ఇళ్ల ముందు దివ్వెలు కొట్టి తమ ఇష్టదైవాలను స్మరించుకున్నారు. అనంతరం మందుగుండు సామగ్రిని కాల్చారు. సబ్బవరం మండలంలో దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్లు, దుకాణాలను దీపాలతో అలంకరించారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవీ పూజలు చేశారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కశింకోట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టి వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో చుక్కా చంద్రశేఖరరావు సూచించారు. మంగళవారం బయ్యవరం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులు, తాగునీటి ట్యాంకులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల్లో పేరుకుపోయిన చెత్తను దగ్గరుండి శుభ్రం చేయించారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం ఎప్పుడు చేశారనే అంశాలను నల్లని బోర్డుపై రాసి ఉంచాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామ పంచాయతీలు అపరిశుభ్రంగా ఉంచితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

తల్లి, కుమారుడు అదృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల పంచాయతీ చినబాబు కాలనీకి చెందిన తన కుమార్తె, మనవడు కనిపించడం లేదంటూ ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. చినబాబుకాలనీలో ఉంటున్న వివాహిత కె.జ్యోతి ఈ నెల 18వ తేదీన తన తొమ్మిదేళ్ల కుమారుడు స్వరూప్‌తో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తరువాత తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లల్లో వాకబుచేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లి కె.వెంకటలక్ష్మి సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కుమ్మరివీధిలో బైక్ అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరివీధికి చెందిన దొడ్డి వెంకట ఆది త్రినాథరావు రోజూ మాదిరిగానే ఈ నెల నాలుగో తేదీ రాత్రి రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌ను తన ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఐదో తేదీ ఉదయం బైక్ కనిపించలేదు. పలుచోట్ల గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న ఎనిమిది మందిపై కేసు



గొల్లలపాలెం సర్వే నంబరు 249లో హెచ్చరిక బోర్డును తొలగించిన స్థలం ఇదే

సబ్బవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనకపల్లి శివారు ఎరుకు నాయుడుపాలెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న ఎనిమిది మందిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు తహశీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. ఎరుకునాయుడుపాలెం సర్వే నంబర్లు 161/2, 162/21, 162/22, 164/2లలో ప్రభుత్వ బంద (నీటి వనరు), బంజరు భూమి సుమారు 50 సెంట్లు వుంది. చింతల అప్పలనాయుడు, గంగునాయుడు, శ్రీను, కర్రి రమణమ్మ, చింతల గంగరాజు, త్రిమూర్తులు, ఏనుగుల సత్తిబాబు, సూరిబాబు ఈ భూమిని ఆక్రమించి పశువుల షెడ్‌లు నిర్మించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఇటీవల ఆర్ఐ బి.వీరయ్య ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లగా, ఆక్రమణదారులు వీరిని అడ్డుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన నేరం కింద ఎనిమిది మందిపై మంగళవారం క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

తిరుపతి స్పెషల్‌కు స్పందన కరువు

స్లీపర్ బోగీలు ఏర్పాటు చేసినా కానరాని ప్రయాణికులు

ప్రచార లోపమే కారణమంటున్న ప్రజలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే అనకాపల్లి నుంచి తిరుపతికి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలుకు స్పందన కొరవడింది. మొదటి నుంచి ఈ రైలుకు అన్ని ఏసీ బోగీలు కావడం, సాధారణ రైలు కంటే ఈ రైలులో ప్రయాణానికి రూ.300కు పైగా చార్జీ అధికం కావడంతో ప్రయాణికులు పెద్దగా ఆసక్తి చూపించిన దాఖలాలు లేవు. అయితే



తిరుపతి వెళ్లే ప్రత్యేక రైలు



ఖాళీగా ఉన్న స్లీపర్ బోగీ సీట్లు

సోమవారం బయలుదేరిన ఈ ప్రత్యేక రైలుకు నాలుగు ఏసీ బోగీలను తొలగించి వాటి స్థానంలో స్లీపర్‌క్లాస్ బోగీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ విషయం ప్రయాణికులకు తెలియని పరిస్థితి నెలకొంది. స్లీపర్ బోగీలు వేసిన విషయం కూడా ప్రచారం లేకపోవడంతో పాటు దీపావళి పండుగ కారణంగా కూడా ప్రయాణికులు మాత్రం కానరాలేదు. ఒక్కొక్క స్లీపర్ బోగీలో కనీసం పది మంది కూడా అనకాపల్లి స్టేషన్ నుంచి బయలుదేరలేదు. ఏసీ బోగీలు కూడా ఖాళీగానే కనిపించాయి. ఇదిలా ఉండగా దీపావళి కారణంగా సోమవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోయింది. నిత్యం రద్దీగా ఉండే పాసింజర్ బస్సుల ప్లాట్‌ఫారం బోసిపోయింది.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి: జడ్సీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. తన కార్యాలయంలో శానిటేషన్ సెక్రటరీలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అలాగే దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ రోజూ అన్ని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని సూచించారు. పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు చేపట్టాలని జడ్సీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.బ

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పలకా



మాధవ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న పలకా రవి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పలకా రవి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం విశాఖలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు నియామకపు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బి.నాగేశ్వరరావు, గొర్లి రామునాయుడు, సీనియర్ నాయకుడు గంగుపాం నాగేశ్వరరావు, సాయి పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి ఉత్సవ పోస్టర్ విడుదల



సత్యనారాయణస్వామి కార్తీక మాసం పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాంకీ

కొత్తూరు, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురంలోని హేమగిరి సత్యనారాయణస్వామి ఆలయ కార్తీక మాసం మహోత్సవ పోస్టర్‌ను మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) పాల్గొని ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 20వ తేదీవరకు జరగనున్న కార్తీక మాసం మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆలయ చైర్మన్ ఎ.గణేశ్‌కు ఆయన సూచించారు.

పండగపూట విషాదం

పాతగాజువాక జంక్షన్‌లో ఘోర ప్రమాదం

డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఇద్దరు యువకుల మృతి... మరొకరికి తీవ్ర గాయాలు

గాజువాక/కూర్మన్నపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబాల్లో దీపావళి పండగ ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. అప్పటివరకూ బాణసంచా కాల్చుతూ సంబరంగా గడిపిన ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు తరలిపోవడం కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ దుర్ఘటన పాతగాజువాక జంక్షన్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

కూర్మన్నపాలెం సమీప గౌరీనగర్‌కు చెందిన మారేమల్లి అజయ్‌కుమార్ (18), వెందుర్తి మనోజ్‌కుమార్ (17), కె.మధు (18) సోమవారం దీపావళిని కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం అర్ధరాత్రి 1.30 గంటలకు ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం నుంచి నగరం వైపు బయలుదేరారు. అజయ్ బైక్‌ను నడుపుతుండగా, మనోజ్, మధు వెనుక కూర్చున్నారు. వీరి బైక్ పాతగాజువాక జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్, మనోజ్ మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. కాగా తీవ్రంగా గాయపడిన మధును కేజీహెచ్‌కు తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. కాగా అజయ్ ఐటీఐ చదువుతుండగా, మనోజ్‌కుమార్ ఐటీఐ మధ్యలో నిలిపివేసి, పనులకు వెళుతున్నాడు. యువకుల మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వరహాపురం నుంచి వలస..

చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన అర్జున్, లోవలక్ష్మి దంపతులు ఏకైక కుమారుడు అజయ్‌రాజ్. వీరి కుటుంబం 87వ వార్డు కాశీపాలెం అపార్టుమెంట్‌లో నివసిస్తోంది. అజయ్ ఐటీఐ చదువుతుండగా, తండ్రి అర్జున్ కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో అజయ్ కోళ్ల వ్యాన్‌లో పనిచేస్తూ, తల్లికి అండగా నిలిచి, చెల్లిని ఇంటర్ చదివిస్తున్నాడు. అతడి మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

గవరపాలెం గౌరమ్మ నిలుపు మహోత్సవం



పురవీథుల్లో గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం సతకంపట్టు వద్ద ఆలయంలో గవరపాలెం గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం సోమవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. దాసరిగెడ్డలోని విల్లూరి సత్యం పొలం నుంచి వరిదుబ్బులు తీసుకువచ్చి పూజారితో అమ్మవారికి పెట్టించారు. రమేశ్ ఆర్ట్స్ వారు అందంగా తీర్చిదిద్దిన గౌరీపరమేశ్వరుల విగ్రహానికి ఆలయ పురోహితులు సుబ్రహ్మణ్యశర్మ పూజలు నిర్వహించారు. అనంతరం మెయిన్‌రోడ్డులోని మనోహర ఆర్కేడ్ నుంచి పురవీధుల మీదుగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు సాగింది. దారి పొడువున గౌరీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం వేకువజామరం మూడు గంటల సమయంలో సతకంపట్టు ఆలయంలో గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి కేవీ మహాలక్ష్మినాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు కె.మురళీకృష్ణ, పీవీ రమణ, డి.కృష్ణ, కె.ప్రసాద్, మద్దాల శంకరరావు పాల్గొన్నారు.

బాబుకు ఘన నివాళులు



బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాకాశివీధి నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దివంగత తాకాశి ఉమామహేశ్వర రావు (బాబు) 70వ జయంతి సోమవారం జరిగింది. బాబు చిత్రపటానికి ఆయన కుమారులు రాజేశ్, కన్నబాబు, రవిచంద్ర పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ఆహార ప్యాకెట్లు, గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాకాశిబాబు మిత్రమండలి, అనకాపల్లి కాపు సంఘం నాయకులు శ్రీరామదాసు గోవిందరావు, తాడి రామకృష్ణ, కోట్ని అయ్యన్నదొర, బొలిశెట్టి శ్రీనివాసరావు, జాజుల రమేశ్, పెద్దలు తాకాశి సత్యందొర, తాకాశి నాగేశ్, తాకాశి సతీశ్ బాబు చిత్రపటానికి నివాళులర్పించారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

సబ్బవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పోలీసు స్టేషన్ నుంచి మండల కేంద్రం ఎన్టీఆర్ సర్కిల్ వరకు విద్యార్థులు అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం పోలీసులు అమరవీరుల మనశ్శాంతి కోసం రెండు నిమషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.సింహాచలం, సిబ్బంది పరదేశిరావు, తాతారావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రీడా జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డులోని జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్ స్థాయి క్రీడా జట్ల ఎంపిక జరిగింది. డివిజన్‌లోని 12 మండలాల నుంచి సుమారు వెయ్యి మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఇన్‌చార్జి డీఈవో అప్పారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం కబడ్డీ, యోగా జట్లను ఎంపిక చేశారు. కబడ్డీ అండర్-14, అండర్-17 బాలికలను ఎంపిక చేయగా, యోగాకు అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించి బాలురును ఎంపిక చేసినట్టు కోఆర్డినేటర్ ఎస్‌వీ నరసింహం తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మాజీ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

డీఏ జీవోను సవరించాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రకటించిన ఒక విడత డీఏ జీవోను సవరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి డిమాండ్ చేశారు. ప్రభుత్వం 3.6 శాతం డీఏను మంజూరు చేస్తూ జీవో నంబరు 60, 61 విడుదల చేసిందన్నారు. ఈ జీవోలో డీఏ బకాయిలను ఉద్యోగి పదవీ విరమణ పొందిన తరువాత ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ రకమైన జీవోను జారీ చేయలేదన్నారు. ఈ విషయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే జీవోను సవరించాలని కోరారు.

24న సర్వసభ్య సమావేశం

పరవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలోని వెయింటింగ్ హాలులో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడులు

పోలీసుల అదుపులో 11 మంది..

రూ.19 లక్షలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

లంకెలపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదముషివాడ పంచాయతీ పరిధిలోని నక్కవానిపాలెం తోటల్లో ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై పరవాడ పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.11 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ,19 లక్షల నగదుతో పాటు సెల్‌ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. పెదముషివాడ శివారు నక్కవానిపాలెం కొండ ప్రాంత తోటల్లో భారీగా పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో సీఐ మల్లికార్జునరావు తన సిబ్బందితో కలిసి దాడులు చేయగా, 11 మంది పట్టుబడ్డారు. కొంత మంది పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.19 లక్షల నగదు, సెల్‌ఫోన్‌లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొంత మంది తమ వాహనాలను విడిచి పర్యారయ్యారు. పూర్తి వివరాలను తెలియాల్సి ఉంది. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్చరిక బోర్డు తొలగించిన వ్యక్తిపై క్రిమినల్ కేసు

సబ్బవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెం సర్వే నంబరు 249లో గెడ్డవాగు/ ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతోపాటు, స్థానికులు ఇచ్చిన సమాచారంతో 13వ తేదీన సర్వే నంబరు 249లోని గెడ్డవాగు/ ప్రభుత్వ భూమిలో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. తరువాత ఈ స్థలాన్ని గతంలో ఆక్రమించిన కొమ్ము పైడిరాజు బోర్డును తీశాడు. దీంతో అతనిపై క్రిమినల్ కేసును నమోదు చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

హామీలు నెరవేర్చాకే పంప్డ్ స్టోరేజీ పనులు ప్రారంభం

» గిరిజనులు అపోహలు వీడాలి

» సీలేరు కాంప్లెక్సు జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు

సీలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీలేరు పంప్డ్ స్టోరేజీపై ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరవేర్చిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, ఈ విషయంలో స్థానిక ప్రజలు, గిరిజన సంఘాల నాయకుల్లో అపోహలు వద్దని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ రాజారావు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం స్థానిక జెన్‌కో అతిథి గృహంలో సీలేరు గ్రామపెద్దలు, ఆదివాసీ సంఘాల నేతలు, నిర్వాసిత గ్రామాల పెద్దలతో సీలేరు కాంప్లెక్సు జెన్‌కో అధికారులు ప్రజా వేదిక నిర్వహించారు. సీలేరు సమీపంలోని పార్వతీనగర్ వద్ద ఏపీ జెన్‌కో నిర్మించనున్న 1350 మెగావాట్ల పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు 2024 ఏప్రిల్ 1న సీలేరులో ప్రజాభిప్రాయసేకరణను జెన్‌కో అధికారులు నిర్వహించారు. జేసీ, పర్యావరణ అధికారులు నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఇళ్ల , భూమికి భూమి, ఇంటికి ఒక ఉద్యోగం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తదితర హామీలను ప్రకటించినట్టు చెప్పారు. అయితే, గత మూడు నెలలుగా ప్రాజెక్టు నిర్మాణ పనులను దక్కించుకున్న మెగా కంపెనీ టీఆర్‌సీ క్యాంప్‌లో కార్యాలయాల నిర్మాణంతోపాటు గత రెండు నెలల్లో రెండు సార్లు మెగా కంపెనీ వారు భూమి పూజకు ప్రయత్నించారు. దీనిని నిర్వాసితులు, ఆదివాసీ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రాజెక్టుకు పనులను ఎలా ప్రారంభిస్తారంటూ ప్రతిఘటించారు. దీనిపై ఇటీవల మండల సమావేశంలో కూడా సీలేరులో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు వద్దని తీర్మానం కూడా చేశారు. జిల్లా కలెక్టర్‌కు కూడా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా వినతి పత్రాలందజేశారు. ఈ స్థితిలో జెన్‌కో సీఎండీ, జిల్లా కలెక్టర్ సంయుక్తంగా చర్చించి నిర్వాసితుల డిమాండ్లు పరిష్కరించాలని, తర్వాతే భూమి పూజ, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని సీఈ రాజారావు ఈ సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలను ఇంకా ఏమైనా సమస్య లుం టే తమ దృష్టికి తీసుకువావాలని కోరారు. సీలేరులో 100 పడకల ఆసుపత్రి, సీలేరు గ్రామంలో ప్రభుత్వం నిర్మించే ఇళ్ల నిర్మాణాని కి ఎల్‌పీసీ ఇవ్వాలని, అలాగే శిథిలావస్థలో ఉన్న జెన్‌కో క్వార్టర్లను ప క్కా ఇళ్ల నిర్మాణానికి ప్రైవేటు వ్యక్తులను అనుమతి నివ్వాలని, పీ హెచ్‌సీకి మంజూరైన భర్త్ వెయిటింగ్ హాల్ నిర్మాణానికి స్థలం మం జూరు చేయాలని, జూనియర్ కాలేజీకి భవనాల నిర్మాణానికి అ ను మతులు ఇవ్వాలని, పంప్డ్ స్టోరేజీ పనుల్లో స్థానిక యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు, పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ పి. దుర్జోలు కోరారు. దీనికి జెన్‌కో అధికారులు సానుకూలంగా స్పందించారు. అలాగే ఆదివాసీ దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్క్‌రాజు మా ట్లాడుతూ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో ఉద్యోగ అవకాశాలు 100 శాతం గిరిజనులకే దక్కాలని అన్నారు. ప్రా జెక్టు నిర్మాణంతో ఏయే గ్రా మాలకు నష్టం జరుగుతుందో వివరాలు అందజేయాలన్నారు. నిర్వాసితులకునష్టపరిహారం, ఉపాధి, కల్పన తదితర అంశాలపై కూడా తమకు లిఖిత పూర్వకంగా అం దించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు బాలకృష్ణ, రత్నకుమార్ (విజయవాడ, విద్యుత్‌సౌధ), ఏడీఈలు అప్పలనాయుడు, జైపాల్, ఏఈఈ సురేశ్, కూటమి నాయకులు చిటికెల రాము, కృష్ణ, సన్యాసిరావు, బా లకృష్ణ, అప్పలరాజు, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, సత్తిబాబు, వైసీపీ నాయకులు స్వర్ణలత, బుజ్జి ఆదివాసీ నాయకుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ రాజారావు

నీలి నింగిపై.. వెండి జలతారు



ముంచంగిపుట్టులో మంగళవారం సూర్యోదయ సమయంలో నీలి మేఘాలు

ముంచంగిపుట్టు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నీలి మేఘాలు మంగళవారం ఆకట్టుకున్నాయి. ఎత్తైన గిరుల మధ్య సూర్యోదయం సమయంలో మేఘాలపై వెండి మబ్బులు చూపరులను కట్టిపడేశాయి. రోజంతా వివిధ ఆకారాల్లో దర్శనమిచ్చాయి. ప్రకృతి గీసిన చిత్రంలా తలపించిన ఈ మేఘాలను 'ఆంధ్రజ్యోతి ' కెమెరాలో బంధించింది.

పాడేరులో..

పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో వెండి మబ్బులు ఆవిష్కృతమై చూపరులకు కనువిందు చేశాయి. ఆకాశం నిర్మలంగా ఉన్న వేళ ఈ దృశ్యం కనిపించింది. దీనిని 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించింది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఐఈవో



మాట్లాడుతున్న డీఐఈవో భీమశంకరరావు

పెదబయలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇం టర్మీడియట్ అధికారి (డీఐఈవో) భీమశంకరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెదబయలు గురుకుల కళాశాల, ముంచంగిపుట్టులో జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీలో ముంచంగిపుట్టు మండలం కిలగడ గ్రామానికి చెందిన ఆరుగురు ఉద్యోగాలు సాధించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏజీఎంసీ విశ్వనాథం, ప్రిన్సిపాల్స్ కేశవరావు, కొండన్నదొరపాల్గొన్నారు.

'అమిడేలు గ్రామంలో వసతులు కల్పించాలి'

పెదబయలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి పక్కా రహదారి నిర్మించాలని మండలంలోని బొంగరం పంచాయతీ అమిడేలు గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో జీఎస్‌యూ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సరైన రహదారి లేక అత్యవసరాల్లో అవస్థలు పడుతున్నామన్నారు. రోడ్డు సదుపాయం లేక 30 మంది విద్యార్థులు పక్క గ్రామమైన పోతులగరువు పాఠశాలకు వాగుల దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని వా పోయారు. గ్రామంలో చిన్న పాకలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుం దన్నారు.ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు మాధవరావు, బాబూజీ, గ్రామస్థులు బంగారాజు, శ్రీను, రమేశ్, సత్యనారాయణ, గున్నమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది సమ్మె నోటీసు

అరకులోయ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 22 (బుధవారం) నుంచి సమ్మెకు వెళ్లనున్నట్టు వారు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. అధికారులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ, 2024లో కార్మికుల వేతనాలను రూ. 18, 600 పెం చుతూ జారీ చేసిన జీవోను అమలు చేయాలని కోరారు. అప్పటి నుంచి ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, జీతాలకు ఎఫ్ఆర్ఎస్‌కు లింకు పెట్టొద్దని కోరారు.

ఊటగెడ్డ నీటి ప్రవాహంతో రోడ్డు ఛిద్రం

» దెబ్బతింటున్న అరకు- విశాఖ ప్రధాన రహదారి

» ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు

అనంతగిరి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అర కు- విశాఖ ప్రధాన రహదారిపై ఊటగెడ్డ నీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు దెబ్బతింటోంది. రహదారిపై గోతులు పడుతుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఊటనీరు కారణంగా రహదారిపై నాచుపట్టి ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పీహెచ్‌సీ సమీపంలోని ఊటగెడ్డ నీరు భారీగా ప్రవహిస్తోంది. అయితే డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో రహదారి పై నుంచి నీరు పారుతోంది. అరకు- విశాఖ ప్రధాన రహదారిలో రెండు చోట్ల రెండు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి ఊటగెడ్డ నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టకపోతే రహదారి పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని స్థానికులు చెబు తున్నారు.

బొర్రా రోడ్డులో జారిపడిన కొండచరియలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు రోడ్డులోని రైల్వేగేటు సమీపంలోని మలుపు వద్ద కొండచరియలు జారిపడడంతో వాహనాల రాకపోకలు కొంత సేపు ఇబ్బందులు ఎదురయ్యాయి. గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం రాత్రి బొర్రా రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు అదే ప్రదేశంలో కొండచరియాలు జారిపడడంతో రైల్వేశాఖ కొంతవరకు కాంక్రీట్ గోడను నిర్మించింది. అయితే సగం వరకే గోడ నిర్మించడంతో పైనుంచి కొండచరియలు జారిపడ్డాయి. దీంతో పర్యాటక వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగించాయి. రోడ్డుపై సగం కొండచరియలు ఉండడంతో బొర్రాకు వచ్చిన పర్యాటకుల వాహనాలకు కొంతవరకు ఇబ్బందులు తలెత్తాయి.



అనంతగిరి పీహెచ్‌సీ సమీపంలోని ప్రవహిస్తున్న ఊటగెడ్డ నీరు

లంబసింగి అందాలు అద్భుతం

గోండియా జిల్లా సెషన్స్ న్యాయమూర్తి అదిల్ ఎం ఖాన్



చెరువులవేనంలో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న న్యాయమూర్తి, కుటుంబ సభ్యులు

చింతపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగి అందాలు అద్భుతంగా ఉన్నాయని మహారాష్ట్ర గోండియా జిల్లా సెషన్స్ న్యాయమూర్తి అదిల్ ఎం. ఖాన్ అన్నారు. మంగళవారం లంబసింగిలో కుటుంబ సమేతంగా న్యాయమూర్తి పర్యటించారు. రాత్రి లంబసింగి హరిత రిసార్ట్‌లో బస చేసిన ఆయన ఉదయం చెరువులవేనం వ్యూపాయింట్‌ని సందర్శించారు. ప్రకృతి, మంచు అందాలను తిలకించారు. అనంతరం తాజంగి జలాశయం వద్దకు చేరుకుని సాహస క్రీడలను ఆస్వాదించారు. లంబసింగిలో గిరిజన రైతులు సాగు చేస్తున్న బొప్పాయి, స్ట్రాబెర్రీ తోటలను పరిశీలించారు. కృష్ణాపురంలో అటవీశాఖ నిర్వాహణలోనున్న ఎకో టూరిజాన్ని సందర్శించారు. అనంతరం కొత్తపల్లి జలపాతానికి వెళ్లారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. స్థానిక ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో వి. సదానందరావు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం

పెదబయలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం మరువలేమని స్థానిక ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. సాయంత్రం సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 1959లో భారత్-చైనా సరిహద్దుల్లో విధి నిర్వహణలో అమరులైన దేశ జవానులకు గుర్తుగా ఏటా అక్టోబరు 21నఅమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు.

గూడెంకొత్తవీధి: పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని స్థానిక ఎస్ఐ సురేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు శాంతి భద్రతలు కల్పించేందుకు 24గంటలు పోలీసులు సేవలందిస్తున్నారన్నారు. కొన్ని సార్లు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు.



పెదబయలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆందోళన

అరకులోయ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హైడ్రోపవర్ ప్రాజెక్టును అనుమతులు రద్దు చేయాలని గిరిజన సంఘం, హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాటకమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ఈ మేరకు తాంగులగుడ గ్రామంలో సంబంధిత కార్పొరేట్ కంపెనీల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం గిరిజనులకు విద్యా, వైద్యం, తాగునీటి సౌకర్యంతో పాటు రహదారి సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతే తప్ప గిరిజనుల బతుకులను వీధి పాలు చేసే హైడ్రో ప్రాజక్టులకు అనుమతులు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సం^ఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, మండల సిపీఎం కార్యదర్శి కిండంగి రామారావు, భస్కి, లోతేరు ప్రాంత హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేకపోరాట కమిటీల కన్వీనర్లు కొర్రా స్వామి, బురిడి దశరత్, తాంగులగుడ గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి గిరిజన యువతి మృతి



మృతి చెందిన సుమిత్ర(ఫైల్)

గూడెంకొత్తవీధి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రింతాడ పంచాయతీ నేలపాడు గ్రామానికి చెందిన ఓ గిరిజన యువతి కాఫీ తోట పనులకు వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నేలపాడుకు చెందిన పాంగి సుమిత్ర(22) మంగళవారం ఉదయం కాఫీ తోటల్లో జంగిల్ తొలగింపు పనులకు కుటుంబ సభ్యులతో కలిసి అడవికి బయలుదేరారు. ఆమె మార్గ మధ్యంలో కాలుజారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. గ్రామానికి రహదారి సదుపాయంలేదు. దీంతో కుటుంబ సభ్యులు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు ప్రధాన రహదారి వరకు డోలీలో మోసుకొచ్చారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి మార్గ మధ్యలోనే మృతి చెందింది. కాగా, గ్రామానికి రహదారి సదుపాయముంటే సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాన్ని కాపాడుకునే అవకాశం ఉండేదని మృతురాలి కుటుంబ సభ్యులు స్థానిక గిరిజనులు వాపోయారు.

టీఆర్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



జిల్లా ట్రైబల్ రైట్స్ ఫోరమ్ (టీఆర్ఎఫ్) సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

పాడేరురూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ట్రైబల్ రైట్స్ ఫోరం (టీఆర్ఎఫ్) నూతన కార్యవర్గం ఎంపిక మంగళవారం నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్, టీఆర్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్. ఆర్ఎస్. వరహాలదొర, టీఆర్ఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పొయిభ పూర్ణిరావు ఆధ్వర్యంలో నిర్వహించినట్టు సంఘం జిల్లా ప్రెసిడెంట్, జేఏసీ నాయకులు ముఖి శేషాద్రి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పొయిభరెడ్డి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జర్సింగి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పొయిభ అప్పలస్వామి, జి.నాని, సహాయ కార్యదర్శులుగా బోనంగి వెంకట్ పడాల్, పొయిభ చలపతి, కోశాధికారిగా జాగరపు చలపతి ఎంపికయ్యారు. సమావేశంలో టీఆర్ఎఫ్ విజయనగరం , శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు నరసింహదొర, భానుచందర్, జిల్లా జేఏసీ నాయకులు ఎస్‌కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలపై బస్సు యాత్ర



పోస్టర్ ఆవిష్కరించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా ఇ చ్ఛాపురం నుంచి అనంతపురం జిల్లా హిందూపురం వరకు చేపడుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణీంద్ర, జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ కోరారు. ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి విద్యార్థుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లులేక అనేక మంది అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు రూ. 640 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీపీపీ విధానం రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్వహించాలని కోరారు. మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలోనాయకులు జగదీశ్, తనిష్, కల్యాణ్, మహేశ్, వరుణ్, గణేష్, పవన్ పాల్గొన్నారు.

మావోల బంద్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

పాడేరురూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు ఈ నెల 24వ తేదీ శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పాడేరు సబ్‌డివిజన్ పరిధిలోని వీఐపీలు, వీవీఐపీలు, హిట్‌లిస్టులో ఉన్న ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టార్గెట్‌లో ఉన్న వారు మారుమూల గ్రామాలకు వెళ్లవద్దు అన్నారు. ఎవరైనా వెళ్లాలంటే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే, మావోలు బంద్ నేపథ్యంలో 24వ తేదీన ప్రజా భద్రత దృష్ట్యా ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ షహబాజ్ అహమ్మద్

ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండగ

పాడేరురూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండలంలో సోమవారం దీ పావళి పండగను ప్రజలు అంగరంగ వైభవంగా జరిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వ్యాపారులు 18 బాణసంచా షాపులను ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులతో షాపులు రద్దీగా మారాయి. మందుగుండు సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. అయినా, కొనుగోలుపై ప్రభావం చూపలేదు. కు మ్మర్లు సంప్రదాయ రీతిలో తయారు చేసిన మట్టి ప్రమిదలు అమ్మకాలు జోరుగా సాగాయి. అరటిపండ్లు, కొబ్బరికాయలకు గిరాకీ పెరిగింది. డజను అరటి పండ్లు రూ. 60 నుంచి రూ. 80 వరకు, కొబ్బరికాయ రూ. 50 నుంచి రూ. 60కి అమ్మకం చేపట్టారు. స్థానిక మోదకొండమ్మ ఆలయంలో సోమవారం రాత్రి దీపావళి వేడుకలు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బాణ సంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. వెంకటరమణ, కె.రాధాకృష్ణన్ నాయుడు, దన్నేటి పటాసి రాము, పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: అరకులోయలో సోమవారం దీపావళి పండగ ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు దీపాలతో అలంకరించారు. పలురకాల మందుగుండు సామగ్రి కాల్చారు. చిన్నా, పెద్దలు సందడి చేశారు.



మోదకొండమ్మ ఆలయంలో మతాబులు కాల్చుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడలో ఘనంగా దీపావళి సంబ రాలు జరుపుకున్నారు. చిన్నారులు, యువత సంతోషాలతో మందుగుండు కాల్చారు. వీధులను వెలుగు కాంతులు నింపారు.

జి.మాడుగుల: మండలంలోని దీపావళి సం బరాలు ఘనంగా జరిగాయి.ఇళ్లల్లో భక్తి శ్రద్ధలతో లక్ష్మీ పూజలు జరిపారు. సాయంత్రం పిల్లాపాపలతో బాణ సంచాలు వెలిగించారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ



బాటిల్స్ అందజేస్తున్న ఎంఈవోలు, సొసైటీ ప్రతినిధులు

చింతపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పాఠశాలల విద్యార్థులకు కాకినాడ సమైక్య చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు వాటర్ బాటిల్స్ పంపిణీ చేసినట్టు స్థానిక ఎంఈవో పీబీవీవీవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ప్రాజెక్టు జలధార కార్యక్రమంలో భాగంగా ఈ సొసైటీ ప్రతినిధులు ఈ వాటర్ బాటిల్స్‌ని ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడంనాయుడు, సమైక్య చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు క్రిస్టియన్‌బాబు, సుధీర్ పాల్గొన్నారు.

కలకలం రేపిన జడ్పీటీసీ హత్యోదంతం

... 5వ పేజీ తరువాయి

సర్వే నంబర్లు 139, 139/1, 139/2గా సబ్‌డివిజన్ చేయించుకున్నారు. తరువాత 04.10.2021న తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన మల్లాది రామరెడ్డికి విక్రయించారు. అనంతరం ఆయన ఈ భూముల్లో వున్న గిరిజనులను తొలగించి, తనకు అప్పగించాలని వారా నూకరాజుపై ఒత్తిడి తెచ్చారు. ఈ సందర్భంగా నూకరాజుకు, సాగుదారులకు మధ్య గొడవ జరిగింది. 2022లో అప్పటి తహశీల్దార్ వెంకటేశ్వరరావు వెబ్‌ల్యాండ్‌లో సాగుదారుల కాలమ్‌లో ఉన్న గిరిజనుల పేర్లను తొలగించి, మల్లాది రామిరెడ్డి పేరు చేర్చారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో సొమ్ము చేతులు మారినట్టు ఆరో పణలు వచ్చాయి.మళ్లీ వారా నూకరాజు డాక్యుమెంట్ నంబరు 508/2023 ద్వారా 19.01.2023న 4.9ఎకరాలు, డాక్యుమెంట్ నంబరు 509/2023 ద్వారా 4.93 ఎకరాలు.. మొత్తం 9.83 ఎకరాలను మల్లాది రామిరెడ్డి ఉంచి కొనుగోలు చేశాడు. ఒకసారి అమ్మిన భూమిని రెండేళ్లకే తిరిగి వారా నూకరాజు కొనుగోలు చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది.తాను కొనుగోలు చేసిన భూమిని ఆధీనంలోకి తెచ్చుకోవడానికి నూకరాజు ప్రయత్నించగా.. సాగుదారులు ఎదురుతిరిగారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తరువాత నూకరాజుకు, సాగుదారులైన గిరిజనులకు మధ్య తరచూ గొ డ వలు జరుగుతున్నాయి. భూములను గిరిజనులే సాగు చేసుకుంటున్నారు. నూకరాజు ఈ ఏడాది మార్చిలో నాలుగు ఆటోల్లో 20 మందిని చటర్జీపురం తీసుకెళ్లి గిరిజనులు సాగుచేసుకుంటున్న అరటి, జామ, ఇతర పంటలను నరికివేయించాడు. ఈ సందర్భంగా గిరిజనులుదాడి చేయడంతో నూకరాజుకు, ఆయన కుమారుడు కన్నబాబుకు గాయాల య్యాయి. పోలీసులు అక్కడకు వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు నర్సీపట్నం కోర్టులో నడుస్తున్నది. తరువాత నూకరాజు రెండు, మూడుసార్లు గిరిజనులను బెదిరించడంతో వారు ఈ విషయాన్ని తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఎవ్వరూ ఆ భూముల్లోకి వెళ్లవద్దని, పంటలను సైతం అలాగే వుంచేయాలని తహశీల్దారు ఆదేశించారు. ఇరు వర్గాలను బైండోవర్ చేశారు. మరోవైపు నూకరాజు తన భూములను తనకు అప్ప గించాలంటూ కలెక్టర్, తహశీల్దార్‌కు పలుమార్లు అర్జీలు అందజేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నూకరాజు, మరో పది మందితో కలిసి వివాదాస్పద భూముల వద్దకు వెళ్లి, సాగుదారులైన గిరిజనులతో గొడవకు దిగారు. దీంతో వారు ఎదురుదాడి చేసి, తీవ్రంగా గాయపరడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నూకరాజు పదేళ్ల నుంచి ఏ భూమి కోసం గిరిజనులతో గొడవలు పడుతున్నాడో.. చివరకు అదే భూమిలో ప్రాణాలు వదలడం యాదృచ్ఛికం!

కాగా ఈ భూ వివాదానికి సంబంధించి డిప్యూటీ తహశీల్దార్ శివను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇటీవల క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని, భూమికి సంబంధించి గిరిజనుల వద్ద ఎటువంటి రికార్డులు లేవని, వారు సాగులో మాత్రమే ఉన్నారని చెప్పారు. 2023లో అప్పటి తహశీల్దార్ వెంకటేశ్వరరావు వెబ్‌ల్యాండ్‌లో నుంచి గిరిజనుల పేర్లు తొలగించారన్నారు. సర్వే నంబరు 139కి సంబంధించి రికార్డుల్లో వారా నూకరాజు పేరు వుందని, 7.39 ఎకరాల భూమిని ఆయనకు అప్పగించడానికి రికార్డులు తయారుచేశామని చెప్పారు. మిగతా 2.44 ఎకరాలకు సంబంధించి కోర్టు వివాదంలో ఉన్నందున కోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

వైద్య సేవలు బంద్

... 5వ పేజీ తరువాయి

పడుతున్నారు. జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు పక్కనున్న ఉమ్మడి తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందినవారు వస్తుంటారు. సాధారణ రోజుల్లో ఆస్పత్రుల్లో రోగులను చేర్చుకునేందుకు ముందస్తు అనుమతి కోసం అభ్యర్థనలు (ప్రీ ఆథరైజేషన్) 600 నుంచి 700 వరకూ వస్తుంటాయి. ఆస్పత్రులు సమ్మెలోకి దిగినప్పటి నుంచి 100 నుంచి 150 మాత్రమే ఉంటున్నాయి. అంటే, నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఏ స్థాయిలో సేవలు నిలిచిపోయాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం వస్తున్న ప్రీ ఆథరైజేషన్స్‌లో కూడా కేజీహెచ్, విమ్స్ వంటి ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు అత్యవసర వైద్య సేవలకు సంబంధించినవే ఉంటున్నాయి.

కొన్ని ఆస్పత్రుల్లో అత్యవసర సేవలకు ఓకే..

నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు కొన్ని హార్ట్ అటాక్, పాలీ ట్రామా, రోడ్ యాక్సిడెంట్స్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు చూస్తున్నాయి. మరికొన్ని ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తు న్నాయి. ఇకపోతే, ఇప్పటికే వైద్య సేవలు పొందుతున్న డయాలసిస్, క్యాన్సర్ రోగు లకు మాత్రం యథావిధిగా సేవలు అందించాల్సి ఉంది. వీటికి ఇబ్బందిపెడితే అధికారులకు రోగులు ఫిర్యాదులు చేయవచ్చు.

స్పష్టత కరువు

తొలిసారి నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు పది రోజులకుపైగా సమ్మెలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం జిల్లాలోని ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్లు రావాల్సి ఉందంటున్నారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు సమ్మె విరమించబోమని ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. సమ్మెను విరమింపజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అప్పటివరకు రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ప్రత్యామ్నాయంగా కేజీహెచ్, విమ్స్‌తోపాటు బోధనాస్పత్రులుగా ఉన్న గీతం, గాయత్రి, ఎన్ఆర్ఐతోపాటు మరికొన్ని ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ తరహా ఇబ్బందులతో వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కె.అప్పారావు, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్


కుటుంబ సభ్యులతో మతాబులు వెలిగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

వాడవాడలా దీపావళి పండుగ

నర్సీపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో వాడవాడలా దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఇంటి పెరట్లో దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి సంబరం చేసుకున్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు నర్సీపట్నంలోని శివపురంలో వారి నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి మతాబులు వెలిగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్పీకర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్, కౌన్సిలర్ రాజేశ్ దంపతులు పాల్గొన్నారు. పెదబొడ్డేపల్లిలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, ఏఎల్ పురం, చోద్యం, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో శనివారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల వద్ద కుటుంబ సమేతంగా బాణసంచా వెలిగించారు. అలాగే వీధుల్లో మతాబులు పేల్చారు.

నాతవరంలో...

నాతవరం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో ఎస్ఐ తారకేశ్వరరావు దీపావళి పండుగను జరుపుకున్నారు. సొంత ఖర్చులతో దీపావళి సామగ్రిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందించారు. వారితో మతాబులు కూడా కాల్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులతో దీపావళి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు మంచి ఆలోచన శక్తి కలిగి ఉండాలని కోరారు.

పండగపూట విషాదం

పాతగాజువాక జంక్షన్‌లో ఘోర ప్రమాదం

డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఇద్దరు యువకుల మృతి... మరొకరికి తీవ్ర గాయాలు

గాజువాక/కూర్మన్నపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆ కుటుంబాల్లో దీపావళి పండగ ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. అప్పటివరకూ బాణసంచా కాల్చుతూ సంబరంగా గడిపిన ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు తరలిపోవడం కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ దుర్ఘటన పాతగాజువాక జంక్షన్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

కూర్మన్నపాలెం సమీప గౌరీనగర్‌కు చెందిన మారేమల్లి అజయ్‌కుమార్ (18), వెందుర్తి మనోజ్‌కుమార్ (17), కె.మధు (18) సోమవారం దీపావళిని కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం అర్ధరాత్రి 1.30 గంటలకు ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం నుంచి నగరం వైపు బయలుదేరారు. అజయ్ బైక్‌ను నడుపుతుండగా, మనోజ్, మధు వెనుక కూర్చున్నారు. వీరి బైక్ పాత గాజువాక జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్, మనోజ్ మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. కాగా తీవ్రంగా గాయపడిన మధును కేజీహెచ్‌కు తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది. కాగా అజయ్ ఐటీఐ చదువుతుండగా, మనోజ్‌కుమార్ ఐటీఐ మధ్యలో నిలిపివేసి, పనులకు వెళుతున్నాడు. యువకుల మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన

కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు హత్యకు కారకులను అరెస్టు చేయాలని నినాదాలు

గిరిజనులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బైఠాయింపు

సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సుధాకర్ చర్చలు

7.39 ఎకరాల భూమి అప్పగించడానికి అంగీకారం


ఏరియా ఆస్పత్రి ముందు బైఠాయించిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, గిరిజనులు

నర్సీపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట మండలం చటర్జీపురంలో హత్యకు గురైన కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు బంధువులు, ప్రజా ప్రతినిదులు నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మంగళవారం పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఏరియా ఆస్పత్రి ముందు బైఠాయించారు. జడ్పీటీసీ హత్యకు కారణమైన పీఎస్ అజయ్‌కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం పోలీసులు వారా నూకరాజు మృతదేహాన్ని చటర్జీపురం నుంచి ఇక్కడకు తరలించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ వారా నూకరాజు బంధువులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పీటీసీ వారా నూకరాజు హత్య పూర్తిగా శాంతి భద్రతల వైఫల్యమని విమర్శించారు. నూకరాజు చాలా కాలంగా భూ సమస్యతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించి ఉంటే ఆయన హత్య జరిగి ఉండేది కాదన్నారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నామని చెబుతున్నారని, వివాదానికి కారణమైన పీఎస్ అజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో చర్చలు

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి సుధాకర్ బాధిత కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో చర్చలు జరిపారు. రోలుగుంట మండలం చటర్జీపురంలో సర్వే నంబరు 130లో 7.29 ఎకరాలు సరిహద్దులు నిర్ణయించి నూకరాజు కుటుంబానికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన భూమి విషయం కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. దీంతో నూకరాజు మృతదేహానికి పోస్టుమార్టం చేయడానికి అంగీకరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్రమ్మ, కొయ్యూరు ఎంపీపీ రమేశ్, చింతపల్లి, గూడెంకొత్తవీధి జడ్పీటీసీ సభ్యులు అనూష, బి.కుమారి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికకు పోటీలు

నర్సీపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం జిల్లా స్థాయి క్రీడా పోటీలకు బాలికల ఎంపికల కోసం ఆదివారం పోటీలను నిర్వహించారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. క్రీడల వల్ల చదువు వెనబడిపోతుందని అపోహ మాత్రమే అన్నారు. పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. పారా ఆర్చర్ శీతల్‌దేవి పుట్టుకతోనే చేతులు లేక పోయినా కాళ్లతో విలువిద్యలో అద్భుతాలు సృష్టిస్తుందన్నారు. జిల్లా స్థాయి ఎంపికల కోసం నిర్వహించిన పోటీలకు 950 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, సెక్రటరీ అచ్చియ్యమ్మ, డివిజనల్ కోఆర్డినేటర్ టీవీ రమణ, పీడీలు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చింతకాయల విజయ్

ఉరుసు ఉత్సవానికి స్పీకర్ అయ్యన్నకు ఆహ్వానం

నాతవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైబీపట్నం గ్రామంలో ఈ నెల 26వ తేదిన జరగనున్న ఉరుసు ఉత్సవానికి రావాలని టీడీపీ నాయకుడు కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసి ఆహ్వానించారు. ఈ ఉత్సవానికి హైదరాబాద్ తదితర దూరప్రాంతాల నుంచి ముస్లిం పెద్దలు వస్తారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొంటారని వారు అయ్యన్నపాత్రుడుకు తెలిపారు.

వైబీపట్నంలో ఉరుసు ఉత్సవానికి హాజరుకావాలని....
టీడీపీ నాయకుడు అప్పలనాయుడుతో కలసి
ముస్లిం సోదరులు స్పీకర్ అయ్యన్నపాత్రుడును ఆహ్వానించారు.



తాడపాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహం ధ్వంసం

నలుగురిపై కేసు నమోదు

మాకవరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడపాల గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఈ ఘటనపై దళిత కుటుంబాల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు విగ్రహాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన దళితులైన పెదపూడి విజయ్, జి.గణేశ్‌తో పాటు ఎమ్మార్పీస్ నాయకుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఘటనకు పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. చురుగ్గా దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

'గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించొద్దు'

మాకవరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదని రామన్నపాలెం టీడీపీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మునాయుడు, మాజీ సర్పంచ్ చుక్కా పోతురాజు, సీనియర్ నేతలు ఎర్రినాయుడు, ఏకా రాము పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ తమకు సమాచారం ఇవ్వడం లేదని, గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. చినరాచపల్లి, వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారన్నారు. పద్ధతి మార్చుకోకపోతే స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఏకా అర్జున, నాయకులు కన్నబాబు, దేముడు పాల్గొన్నారు.

గన్నవరం కార్యదర్శి మృతి

నాతవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం పంచాయతీ కార్యదర్శి కె.గోవిందరావు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. గోవిందరావు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సేవలు అందించే వాడని స్థానికులు చెబుతున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కుమ్మరివీధిలో బైక్ అపహరణకు గురైనట్టు పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రకారం కుమ్మరివీధికి చెందిన దొడ్డి వెంకట ఆదిత్రినాథరావు రోజూ మాదిరిగానే ఈ నెల నాలుగో తేదీ రాత్రి రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌ను తన ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఐదో తేదీ ఉదయం బైక్ కనిపించలేదు. పలుచోట్ల గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్లను పూర్తి చేయాలని గిరిజనుల నిరసన

దేవరాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, బ్రిడ్జి పనులను పూర్తిచేయాలని రామన్నపాలెం గెడ్డ వద్ద ఉరి వేసుకుంటూ గిరిజనులు మంగళవారం నిరసన తెలిపారు. దేవరాపల్లి-వాలాబు రోడ్డు పూర్తి చేయాలని కోడాపల్లి, రామన్నపాలెం, బుచ్చంపాలెం, పూల గరువు గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.పది కోట్లు మంజూరు చేస్తే గత ఏడాది జరిగిన పనులకు నేటికి బిల్లులు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు తురకలపూడి విద్యార్థులు ఎంపిక

బుచ్చెయ్యపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఆటల పోటీల్లో తురకలపూడి హైస్కూల్ విద్యార్థులు డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రకళ రాజు తెలిపారు. సీతయ్యపేటలో 17,18 తేదీలలో జరిగిన మండల స్థాయి ఆటలపోటీలలో అండర్-14 విభాగంలో కురందాసు అనూష, నమ్మి చాందిని, అండర్-17లో చిన్నిదేవి, గొర్లె దేవి, చెలిబోయిన అశ్వని ఖోఖోలో విజయం సాధించారన్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో నమ్మి చాందిని డివిజన్ స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిని ఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడు టీవీ రమణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సంజయ్‌కుమార్ ఎంపిక

బుచ్చెయ్యపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలో వడ్డాది జూనియర్ కళాశాల విద్యార్థి బైన సంజయ్ కుమార్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావు మంగళవారం తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సంజయ్‌కుమార్ క్రీడల్లో రాణిస్తున్నాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ చిన్నారావు,సిబ్బంది అభినందించారు.

రైవాడ కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దేవరాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ ఎడమ ప్రధానకాలువలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాలువ పక్క నుంచి వెళుతున్న కొంతమందికి మృతదేహం కనిపించడంతో స్థానిక వీఆర్వో రమణమ్మకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం ఆమె దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. అనంతరం ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ, మృతుడు వయస్సు 45 నుంచి 50సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని 72 గంటలపాటు కె.కోటపాడు మార్చ్యురీలో ఉంచుతామన్నారు. సమాచారం తెలిస్తే 9440796092 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో పట్నాల గోపి

చీడికాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో పట్నాల గోపి కోరారు. మండలంలో బి.సింగవరం గ్రామంలో సర్పంచ్ శరగడం సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వేలో పారి శుధ్యం విషయమై ఈ గ్రామం వెనుకబడి ఉందన్నారు. అందువల్ల ప్రజలకు అవగాహన కోసం గ్రామంలో పారిశుధ్య పనులను వివిధ గ్రామాల నుంచి కార్మికులను తీసుకువచ్చి చేపట్టారన్నారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుభాష్, వీర్రాజు, నాగేశ్వరరావు, సన్యాసిరావు, వెంకటేష్, సిందూజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైవాడ వరద నీరు విడుదల

దేవరాపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైవాడ జలాశయంలోకి వరద నీరు చేరడంతో గత మూడు రోజుల నుంచి నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తున్నారు. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, 113.80కి శనివారం రాత్రికి చేరడంతో మూడు గేట్ల నుంచి 4 వేల క్యూసెక్కులు వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఋమంగళవారం నీటిమట్టం 112.85 మీటర్లుకు ఉన్నప్పటికీ జలాశయంలోకి సమ్మెద గెడ్డల నుంచి, పినకోట చల్లగెడ్డల నుంచి మూరుమూల గిరిజన ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 2,500 క్యూసెక్కులు వరద నీరు చేరుతోంది. దీంతో జలాశయం నుంచి 4 వేల క్యూసెక్కులు మూడు రెగ్యులేటింగ్ గేట్ల ద్వారా వరద నీటిని శారదా నదిలోకి విడిచి పెడుతున్నామని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. ఇరిగేషన్, విశాఖ నగర పాలక సంస్థకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.


వరద నీరు విడుదల చేయడంతో నిండుగా ప్రవహిస్తున్న శారదా నది


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పీడీ ఎన్. సూర్యలక్ష్మి


బాలికలు అన్ని రంగాలలో ముందుండాలి

» జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

కె.కోటపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. కోటపాడు సచివాలయం పరిధిలో గల స్కూల్స్‌లో మంగళవారం నిర్వహించిన ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యలక్ష్మి మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని, ఏదైనా సమస్య వస్తే టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఆమె ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి. లలితకుమారి, సూపర్‌వైజర్లు సుశీల, అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా దీపావళి వేడుకలు

రావికమతం/దేవరాపల్లి/ మాడుగుల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను సోమవారం ప్రజలు ఆనందంతో జరుపుకున్నారు. ఇంట్లో పిండి వంటలు చేసుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మందుగుండు సామగ్రిని కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణంతో కళకళలాడింది. దేవరాపల్లి మండలం ఏకొత్తపల్లిలో కోదండ రామాలయం విద్యుత్ దీపాలు, కొవ్వొత్తుల వెలుగుల్లో కనువిందు చేసింది.


నాగయ్యపేటలో దీపావళి చేస్తున్న గ్రామస్థులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఐదుగురు బాలికలు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన కొత్తకోట హైస్కూల్ విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రావికమతం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట, రావికమతం హైస్కూళ్లకు చెందిన ఐదుగురు బాలికలు అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నర్సీపట్నంలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలను జిల్లా క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. వీరిలో కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.రమ్యశ్రీ, పడాల హేమశ్రీలు అండర్-14 విభాగానికి, జేఏస్‌కేవీవీఎల్ దేవి, వి.అనురాధ అండర్-17 విభాగ వాలీబాల్‌లో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అలాగే అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలకు పడాల హేమశ్రీ, అండర్-17 విభాగంలో జేఎస్‌వీఎల్ దేవి జిల్లా పోటీలకు ఎంపికయ్యారని కొత్తకోట హైస్కూల్ పీడీ ఆనంద్ తెలిపారు. అలాగే రావికమతం హైస్కూల్‌కు చెందిన అక్కిరెడ్డి స్వాతి అండర్-17 జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యిందని పీడీ కె.ధనుంజయరావు తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు శ్లాఘనీయం

» కొత్తకోట ఏఎస్ఐ సన్యాసిరావు

రావికమతం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు శ్లాఘనీయమని కొత్తకోట ఏఎస్ఐ సన్యాసిరావు అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తకోటలో విద్యార్థులు, వ్యాపారులు,ఆటో యూనియన్ సభ్యులతో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పాడ్డారు. అమరవరుల ఆత్మశాంతికి కొంత సేపు మౌనం పాటించారు. కొత్తకోట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తకోటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు,విద్యార్థులు, గ్రామస్థులు

డిగ్రీ కళాశాల విద్యార్థులకు హ్యాండ్ బుక్కుల పంపిణీ

చోడవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు హ్యాండ్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, కళాశాలలో ఉన్న పరిస్థితులు, పూర్తి వివరాలతో రూపొందించిన హ్యాండ్ బుక్కు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐవీ సత్యవతి, కో-ఆర్డినేటర్ నారాయణమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, పిచ్చమ్మ, కాంట్రాక్టర్లు సుధీర్, అప్పలనాయుడు, మల్లిబాబు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలకు నిరసనగా ఆందోళన

కె.కోటపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలకు నిరసనగా మంగళవారం ఏ. కోడూరు మెయిన్‌రోడ్డుపై రైతు సంఘం ప్రతినిధులు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు మాట్లాడుతూ అమెరికా సుంకాలతో ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయన్నారు. దేశంలో ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతిందన్నారు. ఈ కార్యక్రమంలో వనుము సూర్యనారాయణ, ఈర్లె నాయుడుబాబు, కె. చిన్నబాబు, రొంగలి గోపి, సూరెడ్డి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

చోడవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాగునీటి పథకాలకు నీటి సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురికావడంతో ఈనెల 22వ తేదీన పట్టణంలో నీటి సరఫరా ఉండబోదని స్థానిక పంచాయతీ ఈవో కె. శ్రీనివాసరావు తెలిపారు. జన్నవరం వద్ద పంపు హౌస్ వద్ద నీటిని తోడే మోటారు మరమ్మతుకు గురైందని, దీని మరమ్మతు పని మంగళవారం రాత్రికి కూడా పూర్తికాకపోవడంతో ట్యాంకులకు నీటిని తోడేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అందువల్ల బుధవారం ఉదయం తాగునీరు సరఫరా ఉండదని స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రానికి తాగునీరు సరఫరా చేస్తామని, ప్రజలు సహకరించాలని ఈవో శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

స్థిరమైన వ్యవసాయంతో వరి దిగుబడులు

చీడికాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థిరమైన వ్యవసాయ విధానాల ద్వారా వరిలో దిగుబడులు పెంపునకు అవకాశం ఉంటుందని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు వివరించారు. మంగళవారం శిరిజాం గ్రామంలో రైతులతో వ్యవసాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సేంద్రియ, పర్యావరణ హితమైన వ్యవసాయ పద్ధతులు, నేల ఆరోగ్యం, పరిరక్షణ, నీటి వినియోగం తగ్గింపు, రసాయనాల వాడకంపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.